

సామాన్య కార్యకర్త మేయర్ కావడం సంతోషం 2



25 నుంచి ఇంటర్ పరీక్షలు: కలెక్టర్ 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలి



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. హైదరాబాద్‌లో మంగళవారం నుంచి ఆయా క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులను సోమవారం కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, భవిత కేంద్రాల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



**ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్‌తోపాటు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లిన ఆ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బల్దియాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఈ మేరకు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, కాంగ్రెస్ హస్తగతం కాగా.. కామారెడ్డిలో బీఆర్ఎస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిని చైర్‌పర్సన్ పీఠంపై కూర్చోబెట్టింది. అలాగే నిజామాబాద్ నగరంలో ఎంఐఎం తోడు రాగా కార్పొరేషన్ పీఠంపై కాంగ్రెస్ కార్పొరేటర్ కూరగాయల ఉమారాణి ఆసీనులయ్యారు.**

- అక్షరటుడే, ఇందూరు/ కామారెడ్డి





# పురం.. హస్తగతం





### ▸ ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలను చేజిక్కించుకున్న కాంగ్రెస్ ▸ కొలువుదీరిన పాలకవర్గాలు

నిజామాబాద్ నగరపాలక సంస్థ పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. మేయర్‌గా కాంగ్రెస్‌కు చెందిన 49వ డివిజన్ కార్పొరేటర్ కూరగాయల ఉమారాణిని ఎన్నుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా ఎంఐఎంకు చెందిన 54వ డివిజన్ కార్పొరేటర్ సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. కార్పొరేషన్ లో ఎవరికి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీల పొత్తుతో కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఎవరు ఊహించని విధంగా బీసీ కార్పొరేటర్ ఉమారాణిని మేయర్‌గా ఎన్నుకున్నారు.

#### బస్సుల్లో కార్పొరేషన్ కార్యాలయానికి..

నిజామాబాద్ కార్పొరేషన్ కార్యాలయానికి ఒక్కో పార్టీల వారీగా తమ అభ్యర్థులతో చేరుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 17 మంది కార్పొరేటర్లతో ప్రత్యేక బస్సుల్లో చేరుకున్నారు. అలాగే ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి బీజేపీ నుంచి గెలుపొందిన 28 మంది కార్పొరేటర్లు ప్రత్యేక వాహనంలో కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే 14 మంది ఎంఐఎం కార్పొరేటర్లు, ఒక బీఆర్ఎస్ కార్పొరేటర్ సైతం వచ్చారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు ప్రమాణ స్వీకారం ప్రారంభమైంది. ఎన్నికల సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో ఆర్డీవో రాజేంద్రకుమార్ కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

#### మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక..


కార్పొరేటర్ల ప్రమాణస్వీకరణ అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికను నిర్వహించారు. నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉండగా.. మ్యాజిక్ ఫిగర్ 31 ఏ పార్టీకి రాలేదు. ఇందులో భాగంగా ఎంఐఎం, బీఆర్ఎస్ కార్పొరేటర్ల మద్దతు, ఎక్స్ అఫీషియో సభ్యులైన మహేష్ కుమార్ గౌడ్, భూపతిరెడ్డితో కలిపి కాంగ్రెస్‌కు 34 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్ ఉమారాణిని మేయర్‌గా ప్రకటించారు. కాగా బీజేపీకి 28 మంది కార్పొరేటర్లు, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉండగా వారికి 31ఓట్లు వచ్చాయి. అలాగే డిప్యూటీ మేయర్‌గా 54వ డివిజన్ ఎంఐఎం కార్పొరేటర్ సల్మా తహసీన్‌ను ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ 37వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు.

#### పోలీసులపై ఎంపీ అర్వింద్ అసహనం...

మేయర్ ఎన్నిక సమయంలో కార్పొరేటర్లతో పాటు వచ్చిన ఎంపీ ధర్మపురి అర్వింద్ పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయం లోపలికి వెళ్లే సమయంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు వచ్చేవరకు ఆగాలని ఏసీపీ ప్రకాష్ చెప్పారు. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఓ దశలో 'సిల్లీ ఫెలో' అంటూ వ్యాఖ్యానించారు.

#### కామారెడ్డి జిల్లా హస్తగతం.

కామారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరిగాయి. ఎల్లారెడ్డిలో 12 స్థానాలకు 10, బాన్సువాడలో 19 స్థానాలకు 11, బిచ్కుందలో 12 స్థానాలకు 10 స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడంతో ఆ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగిరింది. కామారెడ్డి పట్టణ ప్రజలు మాత్రం విలక్షణమైన తీర్పు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ మద్దతుతో చైర్‌పర్సన్ పదవి దక్కించుకోవాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. సమీకరణాల్లో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఇప్ప ఉమారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా కాసర్ల గోదావరి (బీఆర్ఎస్) ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థులు పోటీలో నిలిచినా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటి కావడంతో ఆ పార్టీల అభ్యర్థులు సులువుగా గెలుపొందారు.



#### భీమ్‌గల్ చైర్‌పర్సన్‌గా నాగమణి..

భీమ్‌గల్ చైర్‌పర్సన్‌గా నాగమణి, వైస్ చైర్‌పర్సన్‌గా సంటి లత ఎన్నికయ్యారు. పట్టణంలో 12వార్డులకు 8వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. 2 వార్డుల్లో బీజేపీ, రెండు వార్డులు బీఆర్ఎస్ విజయం సాధించాయి. అయితే కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం మేరకు.. మొదటి మూడేళ్లు నాగమణి, చివరి రెండేళ్లు ఆరెపల్లి శ్రీజ నాగేంద్ర చైర్మన్లుగా, వైస్ చైర్‌పర్సన్‌లుగా మొదటి రెండేళ్లు సంటి లత, చివరి మూడేళ్లు పర్శ కుశలత వ్యవహరించనున్నారు.

#### మూడింటిలో స్పష్టమైన మెజారిటీ

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించడంతో కాంగ్రెస్ అభ్యర్థులు చైర్‌పర్సన్లు అయ్యారు. ఈ మూడు మున్సిపాలిటీలలో ఎలాంటి సంఘర్షణలు జరగకుండా, పొలిటికల్ ఇబ్బందులు లేకుండా చైర్మన్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. కామారెడ్డిలో మాత్రం చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. అఖరకు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఉమారాణిని పదవి వరించింది.

#### పట్టణంలో బీఆర్ఎస్‌తో జతకట్టిన కాంగ్రెస్..

కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి 19 స్థానాలు రావడం, బీజేపీకి 16 స్థానాలు దక్కడం ఉత్కంఠను తలపించింది. 11 స్థానాలను గెలుచుకున్న బీఆర్ఎస్ మద్దతు ఎవరికి దక్కితే ఆ పార్టీ చైర్మన్ పీఠాన్ని అధిష్టించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కాంగ్రెస్ గూటికి చేరడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోయాయి. కాంగ్రెస్ స్వతంత్ర అభ్యర్థి ఇప్ప ఉమారాణిని చైర్‌పర్సన్‌గా ప్రకటించగా బీఆర్ఎస్ మద్దతు ఇచ్చింది. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి వైస్ చైర్‌పర్సన్‌గా కాసర్ల గోదావరిని నిలబెట్టగా కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. దీంతో ఇద్దరు ఎన్నికయ్యారు.




#### బోధన్ చైర్‌పర్సన్‌గా తూము పద్మ

బోధన్ చైర్‌పర్సన్‌గా తూము పద్మ, వైస్ చైర్మన్‌గా మీర్ ఇలియాస్ అలీ ఎన్నికయ్యారు. బోధన్‌లో కాంగ్రెస్ 17 స్థానాల్లో విజయం సాధించగా.. ఎంఐఎం 12స్థానాల్లో, బీజేపీ మూడు స్థానాల్లో, బీఆర్ఎస్ 5, ఇండిపెండెంట్లు 1స్థానంలో గెలిచారు. మ్యాజిక్ ఫిగర్ కోసం కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బల్దియా పీఠాన్ని హస్తగతం చేసుకుంది.



#### ఆర్మూర్ చైర్‌పర్సన్‌గా గోనె లహరి

ఆర్మూర్ చైర్‌పర్సన్‌గా గోనె లహరి, వైస్‌చైర్మన్‌గా కాటిపల్లి వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు. బల్దియాలో మొత్తం 36 వార్డులు ఉండగా.. 19 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. బీజేపీ 8స్థానాల్లో, బీఆర్ఎస్ 5, ఎంఐఎం 1 ఇండిపెండెంట్లు ముగ్గురు విజయం సాధించారు.



#### ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో చైర్మన్‌గా పద్మశ్రీకాంత్, వైస్ చైర్‌పర్సన్‌గా మత్తమాల భాగ్యవతి ఎన్నికయ్యారు. పట్టణంలో 12 వార్డులకు గాను 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ నుంచి ఒకరు, స్వతంత్రులుగా ఒకరు గెలుపొందారు.



#### బాన్సువాడలో..

బాన్సువాడలో చైర్‌పర్సన్‌గా కాసుల విజయ, వైస్ చైర్‌పర్సన్‌గా రేష్మా బేగం ఎన్నికయ్యారు. మొత్తం 19వార్డులకు గాను 11 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మూడు స్థానల్లో బీజేపీ, 3స్థానాలో బీఆర్ఎస్, 1 ఎంఐఎం గెలుచుకుంది. కాంగ్రెస్, ఎంఐఎం సభ్యులు మాత్రమే సోమవారం ప్రమాణస్వీకారం చేశారు.



#### బిచ్కుందలో..

బిచ్కుందలో చైర్‌పర్సన్‌గా సీమా రమేష్ షెట్కార్ , వైస్ చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. పట్టణంలో 12వార్డులకు గాను 10 వార్డులు కాంగ్రెస్ గెలుచుకుంది. రెండు స్థానాలో బీఆర్ఎస్ విజయం సాధించింది.













TOWARDS... TRUTH, TRUST, TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
16.2.2026
www.aksharatoday.in
AKSHARA TODAY

## ప్రజాప్రతినిధుల ఒత్తిడికి అధికారులు తలొగ్గొద్దు: ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



**అక్షరటుడే, కామారెడ్డి :** అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి తప్పుడు సంతకాలు చేయవద్దని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. కామారెడ్డిలో పాలవర్గం ప్రమాణస్వీకారం అనంతరం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక ఎలా జరిగిందో ప్రజలు ఆలోచించాలని ఎమ్మెల్యే అన్నారు. తాను ఎమ్మెల్యేగా అయిన తర్వాత మున్సిపాలిటీలో అవినీతి లేకుండా చేశానన్నారు. మరో మూడేళ్లు కూడా ఇదే రీతిలో ఉంటుందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు. ఎక్కడైనా అవినీతి కనిపిస్తే తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు తప్పుడు సంతకాలు చేస్తే ఊరుకునేది లేదని కేవీఆర్ హెచ్చరించారు. అధికారులు నిబంధనల ప్రకారమే పనిచేయాలని సూచించారు. ప్రజాతీర్పును తాము శిరసావహిస్తామని, భవిష్యత్తులో అవతల పార్టీ వాళ్లు ఎలా ఉంటారో తెలియదన్నారు. మున్సిపాలిటీలో అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ చౌరస్తా వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సదరు వ్యక్తి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడి వయస్సు 55ఏళ్ల వరకు ఉంటుందని.. సమాచారం నిమిత్తం 1వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## సామాన్య కార్యకర్త మేయర్ కావడం సంతోషం: మంత్రి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** సామాన్య కార్యకర్త మేయర్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కూరగాయల ఉమారాణి మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదను మేయర్ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. రేవంత్ రెడ్డి పాలనకు రెఫరెండంగా ఈ ఫలితాలు నిలిచాయన్నారు. రాష్ట్రంలో 80 నుంచి 90శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలుచుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ లో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడ జరగడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామీణ ఓటర్ల తీర్పు, మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజల తీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చిందన్నారు. అర్బన్ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. తమ అభ్యర్థులు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామన్నారు. నిజామాబాద్ నగరంలో గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. నిజామాబాద్ కార్పొరేషన్ తో పాటు అన్ని మున్సిపాలిటీలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆదరించి గెలిపించిన నిజామాబాద్ పట్టణ ప్రజలకు పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో నిజామాబాద్‌లో మెజారిటీ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నామన్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత నిజామాబాద్ మేయర్ సీటు గెలుచుకున్నామన్నారు. పండ్లు విక్రయించే స్థాయి నుంచి మేయర్‌గా ఎదిగిన ఉమారాణికి అభినందనలు తెలిపారు. కులం మతం పేరుతో రెచ్చగొట్టినా ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ అయితే జిల్లా మేటి నగరంగా మారుతుందని ప్రజలు ఆశీర్వదించారన్నారు. సెంటిమెంట్ రాజేసి ఉసిగొల్పడం వల్ల దాదాపు 7 సీట్ల వరకు స్వల్ప మెజారిటీతో కోల్పోవాల్సి వచ్చిందని పీసీసీ చీఫ్ అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎం మీద పోటీచేసి 5 సీట్లు గెలుచుకున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిశామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు సుదర్శన్ రెడ్డి, నగర నూతన మేయర్ కూరగాయల ఉమారాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 25 నుంచి ఇంటర్ పరీక్షలు: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**అక్షరటుడే, కామారెడ్డి :** ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలపై జిల్లాస్థాయి అధికారులతో సోమవారం కలెక్టరేట్ లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల కోసం జిల్లాలో 37 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 21 ప్రభుత్వ కళాశాలలు, 6 ప్రభుత్వ సెక్టార్ కళాశాలలు, 10 ప్రైవేట్ కళాశాలాల్లో పరీక్షలు నిర్వహించనునట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17,953 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 9,013 మంది, సెకండియర్ విద్యార్థులు 8,940 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమగ్రంగా చర్చించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల కోసం జిల్లా పరీక్షా కమిటీ నియమించామని, పరీక్షల విభాగం కన్వీనర్‌గా జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, సభ్యులుగా ఎండీ యాకీనుద్దీన్, ఇర్ఫానా ఫర్వీన్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ చర్యలలో భాగంగా ప్రతి 25 కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, అవసరమైతే బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు.

## సీఎం కప్ బేస్‌బాల్ పోటీలకు ముచ్కూర్ విద్యార్థిని



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిహారిక సీఎం కప్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 17 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి 2వ ఎడిషన్ సీఎం కప్ బేస్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. ఈనెల 14న ఆర్మూర్ మినీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో నిహారిక ప్రతిభ కనబర్చి ఈ అవకాశం దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల హెచ్‌ఎం ఆరే రమేష్, ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి సుజాత, సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు



**అక్షరటుడే, ముప్కాల్:** రానున్న వేసవి కాలంలో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ లావణ్య భూమేశ్వర్ అన్నారు. ఈ మేరకు సోమవారం రెంజర్లలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. గ్రామంలో నీటి వనరులు, బోర్లు, పైపులైన్లు తదితర అంశాలను పరిశీలిస్తూ అవసరమైన మరమ్మతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గౌస్ మొహినొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బస్వారాజ్, ఉపసర్పంచ్ ఆకుల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## నిజామాబాద్‌ను అభివృద్ధి చేయడమే మా ఎజెండా : పీసీసీ చీఫ్



**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ జిల్లా అభివృద్ధి తమ ప్రధాన ఎజెండా అని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ ఎన్నిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. తమది అనైతిక పొత్తు కాదని అభివృద్ధి కోసం కేవలం ప్రస్తుత ఎన్నికల్లో మాత్రమే కలిసి వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిజామాబాద్ మేయర్ ఎన్నిక చరిత్ర సృష్టించిందన్నారు. బీద కుటుంబం నుంచి వచ్చిన బీసీ బిడ్డకు మేయర్‌గా అవకాశం ఇచ్చామన్నారు. బీజేపీ నాయకులు మత విద్వేషాలు రెచ్చగొట్టి సీట్లను గెలుచుకున్నారని విమర్శించారు. నగర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనయినేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నగరాన్ని ఆదర్శంగా మారుస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన మేయర్, పాలకవర్గ సభ్యులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికవేళ ఎంపీ అర్వింద్ కీలకవ్యాఖ్యలు



**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సందర్భంగా ఎంపీ అర్వింద్ కీలకవ్యాఖ్యలు చేశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రస్తుత నిజామాబాద్ కార్పొరేషన్ పాలకవర్గం కాల పరిమితి పూర్తయ్యేలోపు కచ్చితంగా బీజేపీ అభ్యర్థిని మేయర్‌గా చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మేయర్ ఎన్నిక అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లుగా కేటీఆర్ పై ఇందుకే కేసులు పెట్టలేదని అర్వింద్ ఆరోపించారు. లోలోపల కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించేందుకు అనైతిక పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు కొందరు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఎంపీ ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థిని విజయలక్ష్మిని దాచిపెట్టడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారన్నారు. అలాగే తాము డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా బంటు రామును నిలబెట్టామని కానీ స్వల్ప మెజారిటీతో ఓడిపోయామన్నారు.

## అవినీతిలో ఎమ్మెల్యేనే కింగ్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ




**అక్షరటుడే, కామారెడ్డి :** అవినీతిపై ఎమ్మెల్యే ఊకదంపుడు మాటలు వద్దని, ఎమ్మెల్యేనే పెద్ద అవినీతి కింగ్ అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. కామారెడ్డి అభివృద్ధి కోసం 22మంది కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు 11మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతు తీసుకున్నామన్నారు. అనంతరం ఉమారాణి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారని, వైస్ ఛైర్‌పర్సన్ పదవి బీఆర్ఎస్‌కు వెళ్లిందన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసినప్పుడు నిజామాబాద్ స్మార్ట్ సిటీ కోసం రూ.వెయ్యి కోట్లు ఇస్తున్నామని చెప్తే కామారెడ్డికి కూడా రూ.500 కోట్లు ఇవ్వాలని అడిగినట్టు చెప్పారు. ప్రత్యేక నిధుల కింద కామారెడ్డికి రూ.300 కోట్లు ఇస్తానని సీఎం హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటికే కామారెడ్డిలో రూ.200 కోట్లతో పలు పనులు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కామారెడ్డిలో తాగునీటి సమస్య లేకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో కామారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. పట్టణంలో 8 కిలోమీటర్ల అంతర్గత పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మాటిమాటికి అవినీతి గురించి మాట్లాడుతున్నాడని, ఆయనే అవినీతి కింగ్ అని షబ్బీర్ అలీ ఆరోపించారు. రైతుల కష్టార్జితంతో డిగ్రీ కళాశాల కోసం భూములు కొనుగోలు చేస్తే వాటిని అరోరా కళాశాలకు అమ్ముకున్నారని, దాని విలువ రూ.18 కోట్లు ఉంటుందని.. ఇది అవినీతి కాదా అని ప్రశ్నించారు. 2015లో తన చేతితో ఎమ్మెల్సీ బీఫారం ఇచ్చి నామినేషన్ వేయిస్తే టికెట్ అమ్ముకుని పారిపోయాడని విమర్శించారు. 45ఏళ్ల తన రాజకీయ జీవితంలో తనపై ఒక్క మరకలేదని, ఒక్క పెట్టి కేసు కూడా లేదని, తన జీవితం తెరిచిన పుస్తకమని చెప్పారు. ఆకాశం మీద ఉమ్మితే మనమీదే పడుతుందని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. అభివృద్ధిలో తమతో కలిసి రావాలని, పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కామారెడ్డిని అభివృద్ధి చేసుకుందామని సూచించారు. కామారెడ్డిని అవినీతి రహిత మున్సిపాలిటీగా తీర్చి దిద్దుకుందామని, కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కామారెడ్డి ప్రజలు హర్షించే విధంగా పని చేసి చూపించాలని, మంచి పాలకవర్గాన్ని అందించానని తనకు పేరు తేవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఇచ్చిన పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, నూతన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గ ప్రమాణస్వీకారం ముగిసింది. ఛైర్‌పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థి (కాంగ్రెస్ రెబల్) ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి కాసర్ల గోదావరి ఎన్నికయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన 11మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. గులాబీ రంగులు చల్లుతూ.. బ్యాండ్ మేళాల మధ్య నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడి నుంచి ఎవరి వార్డుకు వారు తమ వాహనాల్లో ర్యాలీలు తీశారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి వరకు వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి ర్యాలీగా బయలుదేరారు. దేవునిపల్లిలో ఆమెకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పలువురు వార్డు ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాసర్ల గోదావరి మాట్లాడుతూ.. తనకు ఓటు వేసి భారీ మెజారిటీతో రెండోసారి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వచ్చే ఐదేళ్లు కూడా వార్డులో మరింత అభివృద్ధి చేపడతామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 12వ వార్డును ఆదర్శంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు.

## బాన్సువాడ బల్దియా పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన డీసీసీబీ మాజీ ఛైర్మన్



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా కాసుల విజయ బాలరాజు, వైస్ ఛైర్ పర్సన్‌గా రేష్మా బేగం ఎజాజ్ ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించిన విషయం తెలిసిందే. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లకు సైతం అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధి కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో బాన్సువాడను ఆదర్శ మున్సిపాలిటీగా నిలుపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కొత్త పాలకవర్గానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.